సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎస్‌వోఎస్‌కు సరకుల వితరణ



బియ్యం, సరకులు అందిస్తున్న నాయకులు

భీమునిపట్నం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల యువజన విభాగ అధ్యక్షుడు ముత్తంశెట్టి నందీష్‌బాబు జన్మదినాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ వద్ద పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు అందివ్వడంతోపాటు, వారికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. 4వ వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి కొండబాబు, 3వ వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, శిల్ల వంశీరెడ్డి, గొరపల్లి సన్యాసిరావు, ఎర్నింటి అచ్చిబాబు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రాంత ప్రజలకు న్యాయ పరమైన సలహాలు, సహాయం అందివ్వాలనుకునే ఆసక్తి గల పారా లీగల్ వలంటీర్ల (న్యాయ సహాయకులు) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 28లోపు దరాఖాస్తు చేసుకోవచ్చని, కనీస విద్యార్హత 10వ తరగతి అని చెప్పారు. దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కలిపి భీమునిపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులోని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని కోరారు. స్వచ్ఛంద సేవా సంస్థలతోపాటు ఇతర సంస్థల్లో పని చేసిన వారికి ప్రాధాన్యముంటుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ మిథిలాపురి వుడా కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పోర్టుకాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ, చంద్రంపాలెం, సుద్దగెడ్డ, వాంబేకాలనీ, శ్రీనివాస్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

డ్రాపౌట్ విద్యార్థులకు దివీస్ ప్రోత్సాహం



ఓపెన్ స్కూల్ విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపే డ్రాపౌట్ విద్యార్థులను దివీస్ లేబొరేటరీ యాజమాన్యం ప్రోత్సహిస్తోందని ఆ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు.

చిప్పాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ అందించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన ప్రణాళికలు వివరించారు. 10వ తరగతికి 15 మంది, ఇంటర్మీడియట్‌కు 18 మంది విద్యార్థులకు సంస్థ ఫీజు రూపంలో రూ.90వేలు చెల్లించిందన్నారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాస్, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

ప్రతిధ్వనించిన రామనామం

- వాడవాడలా వేడుకగా శ్రీరామ శోభాయాత్రలు
- భక్తిపారవశ్యంతో పులకించిన భక్తులు



మెయిన్‌రోడ్డు రామాలయంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



చంద్రంపాలెంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు



తగరపువలస కూడలిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు

తగరపువలస: అయోధ్యలో నిర్మించిన భవ్య దివ్య మందిరంలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకున్నారు. కోలాటం, బాణసంచా, మేళతాళలతో వాడవాడలా వేడుకగా శ్రీరామ శోభాయాత్ర నిర్వహించి ప్రత్యేక పూజలు, శ్రీరామ గాయత్రి హోమాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామాలయంలో ఆదర్శ దంపతులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకుని ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యేకు కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకర రెడ్డి, వార్డు అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శోభాయాత్రలో కోలాటం, కేరళ డప్పు వాయిద్యాలు, ఉత్తరాది యువకులు జెండాలతో సందడి చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో అర్చకుడు ఆకెళ్ల రవి గణేష్ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ, హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరామ గాయత్రీ హోమం నిర్వహించారు. ప్రసాదం పంపిణీ చేశారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, చిప్పాడలో ఇంటింటా 1800 కుటుంబాలకు శ్రీరాముని జెండాలు పంపిణీ చేసి శోభాయాత్ర చేపట్టారు. రేఖవానిపాలెం పంచాయతీలో కోలాటంతో శోభాయాత్ర చేపట్టారు. సంతపేట కుమ్మరి వీధి, రెడ్డివీధి, ఎస్సీ కాలనీలో, జీరుపేట, చిల్లపేట తదితర రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కొమ్మాది : కొమ్మాది శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో శ్రీరామ చంద్రమూర్తి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజామున నగర సంకీర్తన, రామరక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా, గోవిందనామాలతో పారాయణ చేశారు. అనంతరం సాయంత్రం సహస్ర దీపాలంకరణచేసి అయోధ్య అక్షింతలు పంపిణీ చేసినట్లు ఆలయ అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

సాగర్‌నగర్ ఇస్కాన్‌లో శ్రీరామ శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. శ్రీరామ లీలపై ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని ప్రవచనాలు చేశారు.

శ్రీరామ చంద్రుడు ఆదర్శ పురుషుడు

మధురవాడ / పీఎం పాలెం: శ్రీరామ చంద్రుడు ఆదర్శ పురుషుడని, ఆ నామ స్మరణ ప్రశాంతతను ఇస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అయోధ్యలో బాల రాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని పీఎం పాలెం రామాలయంలో అంతా రామమయం పేరుతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజలు సోమవారం నిర్వహించారు. యాక్టింగ్ ఫిక్సెల్, సృజనా నాట్యమండలి, రామాలయ కమిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తిభావంతోనే ప్రశాంతత లభిస్తోందని చెప్పారు. బ్రహ్మశ్రీ విశ్వనాథ రాజేశ్వరరావు, చీమలపాటి రమణమూర్తి ఆధ్వర్యంలో రామతత్వం, సుందరకాండ పారాయణ, హనుమాన్ చాలీసా, రామాయణం బాలకాండపై ప్రవచనం, గీతాలు ఆలపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం గాయని మణి జాగర్లమూడి మాధవి కృష్ణ, శాస్త్రీయ వాగ్గేయకారులు అధికారుల రవిశాస్త్రి, కేవీ చలపతి రావు, బాల గాయనీమణులు సింధు, సుమేధ అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకాళి ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, వరలక్ష్మి, వీవీ నరసింహారావు, నిర్వాహకులు మణిశర్మ, సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, పోతిన ప్రసాద్, వంకాయల మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

- బాల రాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ట సందర్భంగా భీమిలికి చెందిన డేడ్ త్రినాథ్ రోజంతా ఆటో ద్వారా రామనామ స్మరణ ప్రచారం చేశాడు.
- మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల అడ్రస్ గేటెడ్ కమ్యూనిటీలో ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు.
- చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊత్సవమూర్తులను భజన, కోలాటం, మేళ తాళాలుతో ఊరేగించారు. ఉదయం నుంచే ఆలయంలో అర్చకులు హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అరవింద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆనందపురం : అయోధ్యలో బాల రాముని విగ్రహం ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రామనామ జపంతో దేవాలయాలు హోరెత్తాయి. గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆవాస విద్యాలయం ఆవరణలో హనుమత్ సమేత శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఊరేగించి పల్లకీ సేవ నిర్వహించారు. రామనామ మంత్రం, హనుమాన్ చాలీసా పఠించారు. అయోధ్య కరసేవలో పాల్గొన్న గంటి రామకృష్ణ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మూడు వందల మంది భక్తులు పాల్గొన్నారు. కుసులువాడలో శ్రీరామ భక్త భజన బృందం సభ్యులు రామాలయంలో 12 గంటలపాటు భజన చేసి రామాయణ పారాయణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. నీళ్ల కుండీలు జంక్షన్‌లోని వైఎస్సార్ కాలనీలో భజన మండలి భక్త బృందం శ్రీరాముని నిలువెత్తు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కల్లివానిపాలెం, దుక్కవానిపాలెం, ఆనందపురం, గిడిజాల, తదితర గ్రామాల్లో శ్రీరాముని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో యజ్ఞం

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠం మందిరం ప్రాంతంలో సోమవారం శ్రీ తారక రామ యజ్ఞం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ భక్తదాస ఆధ్వర్యంలో యజ్ఞంతోపాటు దీపోత్సవం, ప్రత్యేక హారతి, హరేనామ సంకీర్తన నిర్వహించారు. సుమారు 600 మంది పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా శ్రీరామ శోభాయాత్ర

భీమునిపట్నం: స్థానిక పెద్దబజారు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కీతిన్‌పేట సన్ స్కూల్ విద్యార్థులు కోలాటం చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పెద్దబజారు మీదుగా బోయివీధి, గొల్లవీధి, రొట్టెవీధి, తోటవీధి ప్రాంతాల్లోని రామాలయాలను సందర్శించుకుని అక్కడ పూజలు నిర్వహించి నెహ్రూ ఉన్నత పాఠశాల రామాలయానికి అందరూ చేరుకున్నారు. అక్కడ భక్తులకు సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు సహకారంతో ప్రసాదాలు, పానకం అందించారు. అనంతరం అర్చకులు, కరసేవకులను కార్యక్రమ నిర్వాహకులు సత్కరించారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అందరూ జై శ్రీరామ్ నినాదాలు చేశారు.

పద్మనాభం: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పలు గ్రామాల్లోని రామాలయాల్లో సోమవారం పూజలు చేసి దీపాలు వెలిగించారు. ర్యాలీలు చేశారు. కృష్ణాపురం, మద్ది, పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం, కృష్ణాకాలనీలోని రామాలయాల్లో పూజలు చేసి దీపాలు వెలగించారు.



ప్రమిదలతో జై శ్రీరామ్



కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



నీళ్ల కుండీలు జంక్షన్‌లో పూజలు చేస్తున్న భక్తులు



గంభీరంలో యజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు



ఏనుగులపాలెంలో రాముని చిత్రపటంతో ర్యాలీలో భక్తులు



చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో శ్రీరామ గాయత్రి హోమం నిర్వహిస్తున్న అర్చకులు



మధురవాడలో జై శ్రీరామ్ ఆకృతిలో భక్తులు వెలిగించిన దీపాలు



ఇస్కాన్‌లో శ్రీరాముని పల్లకీ ఊరేగింపు



ఐటీ సెజ్ వద్ద అడ్రస్ గేటెడ్ కమ్యూనిటీలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



అష్టలక్ష్మి సన్నిధిలో శ్రీరామ సంకీర్తన చేస్తున్న భక్తులు



చిప్పాడలో ఇంటింటికీ శ్రీరాముని జెండాలు పంపిణీ చేస్తున్న యువకులు



కృష్ణంరాజుపేటలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామ నామం ప్రచారం



భీమిలిలో శోభాయాత్రలో భక్తులు, విద్యార్థులు



భీమిలిలో అర్చకులను సత్కరిస్తున్న నిర్వహకులు

ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఆదేశం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం బంగ్లామెట్ట వద్ద స్థలాన్ని ఆయన అధికారులతో పరిశీలించి నిర్మాణానికి అనువైన కొలతలతో భూమిపూజకు సిద్ధం చేయాలన్నారు. గ్రౌండ్ లెవెల్ సరిచేసి, రెవెన్యూ అధికారులు ఇచ్చిన భూమికి హద్దులు గుర్తించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించేందుకు అన్ని విభాగాల అధికారులు సహకరించాలని కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం సహకరిస్తుందన్నారు. ఆయనవెంట నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి, కొప్పల రమేష్, కంటుభుక్త రాంబాబు, కోరాడ లక్ష్మణ, చిల్ల హరి, చింతగుంట శివ, వెంపాడ వెంకటరమణ, తమ్మిన అశోక్, శిల్లా వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంగ్లామెట్ట వద్ద ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

పద్మనాభం: పదో తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుంటుబోతు రాంబాబు సూచించారు. మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 42 మంది పదో తరగతి విద్యార్థులకు వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ చక్కగా చదువుకుని, అధిక మార్కులు సాధించాలని సూచించారు. బుగత సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీపీ రాంబాబు

జీవీఎంసీ ఆస్తుల లీజు కోసం 24న వేలం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లో 8 రకాల ఆస్తుల లీజు కోసం 24న వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన వారు మధురవాడలోని జోనల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో రూ.300 చెల్లించి సేల్ నోటిఫికేషన్ పొందాలని సూచించారు. మధురవాడ డైలీ మార్కెట్, వారపు సంత, ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము, వాహనాల పార్కింగ్, క్యాంటీన్ నిర్వహణ, మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ, ముడసర్లోవ పార్కులో మామిడి, కొబ్బరి చెట్ల ఫలసాయం, మధురవాడ పీవీ నరసింహారావు కళ్యాణ మండపం, మారికవలస ఆర్‌జీకే కళ్యాణ మండపం, ఆరిలోవ లాస్ట్ బస్టాప్ కళ్యాణ మండపం లీజు పద్ధతిలో కేటాయించేందుకు వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

శత శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా చదవాలి

చంద్రంపాలెం విద్యార్థులతో డీఈవో చంద్రకళ

మధురవాడ: పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అంతా చదవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. సోమవారం సాయంత్రం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిప్పాడ దివీస్ యాజమాన్యం సమకూర్చిన 10వ తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు మెరుగు పరచుకుని మరింత మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉన్న 57 రోజుల సమయాన్ని మరింత సద్వినియోగం చేసుకుని చక్కగా చదవాలని సూచించారు. విద్యాభివృద్ధికి దివీస్ యాజమాన్యం చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది 901 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. శత శాతం ఉత్తీర్ణతకు చేస్తున్న కృషిని వివరించారు. ఇప్పటికే ఉపాధ్యాయులు బృందాలుగా విడిపోయి విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత కొంత కాలంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్, లైజనింగ్ అధికారి శ్రీనివాస్, పాఠశాల కమిటీ ప్రతినిధులు పిళ్లా సూరిబాబు పాల్గొన్నారు.



చంద్రంపాలెం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఈవో చంద్రకళ, దివీస్ ప్రతినిధులు

వంద మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం : మండలంలోని లొడలగలవానిపాలెం, నేలేరు గ్రామాల్లో గాయత్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వంద మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సూచనలు, సలహాలు అందజేశారు. సర్పంచ్ లొడగల రాజేశ్వరి శిబిరాన్ని ప్రారంభించగా వైద్యులు డి.విజయ్ గౌరి, జె.సాహితి, బి.రామ్మోహన్ సేవలు అందించారు.

వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలకు న్యాయం

తగరపువలస: వైఎస్సార్‌సీపీలో చిత్తశుద్ధితో పని చేసే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని చేట్ల పోలిరెడ్డి విషయంలో రుజువైందని ఆ పార్టీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి అన్నారు. ఏపీ గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చిల్లపేట నాయకుడు చేట్ల పోలిరెడ్డిని సోమవారం సాయంత్రం సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, శిష్టకరణాల సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, వార్డు కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్‌రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి, నీలాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మూడేళ్ల కాల వ్యవధితో నలుగురు డైరెక్టర్లను నియమించగా వీరిలో పోలిరెడ్డి ఒకరు. ఈ మేరకు కార్పొరేషన్ తరపున ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలిరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.



పోలిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కస్తూర్బా విద్యార్థినుల ర్యాలీ



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

పద్మనాభం: జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ లూనార్ ల్యాండర్‌ను చంద్రుని ఉపరితలంపై దించి భారత్ సరసన చేరడంతో పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. జపాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ, సీఆర్టీలు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com